క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు/ఓదెల: మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తన నివాసంలో శనివారం ఓదెల మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆలయంలో 5వ తేదీ నుంచి 15 వరకు జరిగే ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు, ఈవో బి.సదయ్య, మాజీ ఉపసర్పంచు గిరాం సాంబమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

శ్రద్ధతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ జిల్లా పరిషత్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికతో ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాల్‌రావు, పాఠశాల హెచ్‌ఎం విమల, లయన్స్ క్లబ్ సభ్యులు నరేశ్, రంగారావు, ఉపాధ్యాయులు రామ్‌కిషన్, శ్రీనివాస్, శోభారాణి, భవానీ, విజయలక్ష్మి, జగన్, ఉషారాణి పాల్గొన్నారు.

రేపు ప్రజాపాలన సేవాకేంద్రాలు ప్రారంభం

ఓదెల: రాష్ట్ర ప్రభుత్వం మండలపరిషత్ కార్యాలయాల్లో 4న సోమవారం ప్రజాపాలన సేవాకేంద్రాలను ప్రారంభించనుంది. ఇందులో భాగంగా మండలపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించడానికి అధికారులు, ఉద్యోగిని నియమించింది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారు గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కోసం, చేయూత పథకం లాంటి పథకాల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. గతంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవోలు కోరుతున్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మంజూరు చేసిన రూ.5లక్షల వ్యయంతో ఎంపీటీసీ గోపు లావణ్య సీసీరోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ సీసీరోడ్లతో గ్రామస్తుల ఇబ్బందులు తొలగుతాయన్నారు. పొత్కపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, స్పెషల్ అధికారి మిషన్ భగీరథ ఏఈఈ స్రవంతి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ డాక్టర్ బుచ్చిరెడ్డి, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ ఐపీఎస్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ అభినందించారు. ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాలలో ప్రశంసించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కమాన్‌పూర్: అసెంబ్లీ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని మండలంలోని జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంపీటీసీ శెవ్వ శంకరయ్య పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు.

ఆర్థిక భరోసాకు ‘స్పందన’

కోల్‌సిటీ: మహిళలు స్వయం ఉపాధి పొందేలా కరీంనగర్ జిల్లాకు చెందిన స్పందన సేవా సొసైటీ సంస్థ కృషి చేస్తోంది. స్వయం ఉపాధిలో భాగంగా నిరుపేద మహిళలకు ఉచితంగా సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైవాష్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణకాలంలో ఒకపూట ఉచిత భోజనం సౌకర్యాన్ని కూడా సొసైటీ కల్పిస్తోంది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రూ.750 స్టయిఫండ్‌తో పాటు సర్టిఫికెట్లు అందించి ప్రోత్సహిస్తోంది. నిరుపేద మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా స్పందన సేవా సొసైటీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శోభారాణి 15ఏళ్లుగా కృషి చేస్తున్నారు. సొసైటీ చేస్తున్న కృషిని గుర్తించిన నాబార్డు అధికారులతోపాటు పలు బ్యాంకర్లు కూడా శిక్షణలో నైపుణ్యం పొందిన మహిళలకు బ్యాంక్ నుంచి సబ్సిడీలో రుణాలు పొందేలా సహకారం అందిస్తున్నాయి.

నిరుపేద మహిళలే లక్ష్యం..

సండే స్పెషల్





సారీ రోలింగ్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు



ఉచిత భోజనం

- నిరుపేద మహిళలకు ఉచిత శిక్షణ
- సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైవాష్‌పై ట్రైనింగ్
- 15ఏళ్లుగా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న స్పందన సేవా సొసైటీ సంస్థ
- శిక్షణ అనంతరం స్టయిఫండ్, సర్టిఫికెట్లు

15ఏళ్లుగా కృషి చేస్తున్నాం



నిరుపేద మహిళల ఉపాధికి బాటలు వేయడానికి 15ఏళ్లుగా కృషి చేస్తున్నాం. స్వయం ఉపాధి పొందాలనుకున్న మహిళలను ఎంపిక చేసుకుంటున్నాం. నాబార్డు సహకారంతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సారీ పాలిషింగ్, డ్రైక్లీనింగ్, రోలింగ్ తదితర వాటిపై ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు 6వేల మంది మహిళలకుపైగా ఉచిత శిక్షణ ఇప్పించాం. శిక్షణ తీసుకున్న అందరూ స్వయం ఉపాధి పొందుతున్నారు.
– శోభారాణి, స్పందన సంస్థ వ్యవస్థాపకురాలు

స్పందన సంస్థతో భరోసా



ఇప్పటి వరకు సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైవాష్ ఎలా చేస్తారో తెలియదు. స్పందన సేవా సొసైటీ ఇచ్చిన ఉచిత శిక్షణ నాలో కొత్త ప్రేరణ తీసుకొచ్చింది. శిక్షణలో చాలా మెలకువలు నేర్చుకున్నాను. స్పందన సంస్థతో భరోసా వచ్చింది. ఇంట్లోనే యూనిట్ పెట్టుకోవాలని ఆలోచన వచ్చింది. ఉచిత భోజనం, స్టయిఫండ్‌తోపాటు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు.
– లావణ్య, శిక్షణ పొందిన మహిళ

ఉపాధి పొందుతున్న



సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైవాష్ నేర్చుకోవడానికి 20ఏళ్ల క్రితం రూ.5వేలు ఫీజు కట్టి నేర్చుకున్న. నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఉపాధి పొందుతున్న. నిరుపేద మహిళలు స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో, స్పందన సేవా సొసైటీ ఉచితంగా శిక్షణ ఇచ్చి భరోసా కల్పిస్తోంది. ఈ సంస్థ ద్వారా నేను కూడా 15మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చినందుకు సంతోషంగా ఉంది.
– రజియా భేగం, ట్రైనర్

15 మందికి ట్రైనింగ్ ఇచ్చిన



మార్కెట్‌లో సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైవాష్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇలాంటి వాటిపై స్పందన సొసైటీ, నాబార్డు సహకారంతో ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయం. గతంలో నేను వీటిని నేర్చుకోవడానికి రూ.18వేలు ఫీజు చెల్లించాల్సి వచ్చింది. ఇప్పుడు మహిళలకు ఫ్రీ ట్రైనింగ్ ఇవ్వడం గొప్ప అవకాశం. నేను కూడా స్పందన సహకారంతో 15మందికి ట్రైనింగ్ ఇచ్చే అవకాశం లభించింది.
– భవానీ, ట్రైనర్

శ్రీపాదరావు సేవలు మరువలేనివి



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరామణారావు, నాయకులు



యైటింక్లయిన్‌కాలనీ: కేక్ కట్ చేస్తున్న నాయకులు



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న మేయర్, కమిషనర్







గోదావరిఖని: ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో నివాళి, రామగిరి: నివాళి అర్పిస్తున్న ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు, గోదావరిఖని: జీఎం సూర్యనారాయణ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి కమాన్‌వద్ద..



రామగుండం: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ



పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం యూనియన్.

గోదావరిఖని/రామగిరి/పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి/సుల్తానాబాద్/ముత్తారం/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/పాలకుర్తి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేద ప్రజల కోసం చేసిన సేవలు మరువలేనివని అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. జిల్లావ్యాప్తంగా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో శ్రీపాదరావు 87వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీపాదరావు చేసిన మంచి పనులే ఆయనను జనాల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేశాయన్నారు. నేటి తరానికి ఆయన ఆదర్శమని కొనియాడారు. ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

పల్స్ పోలియో పోస్టర్ ఆవిష్కరణ

జూలపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో విజయవంతం చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎంపీపీ రమాదేవి, తహసీల్దారు బషీరుద్దీన్, ఎంపీడీవో పద్మజ, వైద్యాధికారి సంపత్‌రెడ్డి పోస్టర్లను ఆవిష్కరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పాలకుర్తి: బసంత్‌నగర్‌కు చెందిన జట్‌పట్ రమేశ్ అనే వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం బసంత్‌నగర్ పోలీసులు అందజేశారు. రమేశ్ జనవరిలో తన ఫోన్‌ను పోగొట్టుకుని బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను కనిపెట్టి ఎస్సై స్వామి బాధితుడికి అందజేశారు.

10న కరీంనగర్‌లో ఆత్మీయసభ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన గీత కార్మికులు ఈనెల10న కరీంనగర్‌లో గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని గౌడ సంఘం నేతలు గోపగాని సారయ్య, అంతటి అన్నయ్య, పంజాల రాజన్న, కోట రవి, బి.సురేశ్‌గౌడ్ కోరారు. పెద్దపల్లిలో పలువురు సంఘనేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దివ్యాంగులకు అన్నదానం

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన వ్యాపారస్తులు స్వర్గీయ ప్రాయకరావు శివరామ్ వర్ధంతిని పురస్కరించుకొని మానసిక పునరావాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. శనివారం పట్టణంలోని దివ్యాంగులకు వారి కుమారులు సత్యనారాయణ, శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాటల సీడీ ఆవిష్కరణ

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన ఎలగం కనకయ్య ఉపాధ్యాయుడు చదువు పాటల సీడీని డీఈవో మాధవి ఆవిష్కరించారు. శనివారం పెద్దపల్లి డీఈవో కార్యాలయంలో తోటి ఉపాధ్యాయులతో కలిసి డీఈవోను కలిశారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రభుత్వ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కనకయ్య పాటల రచయిత.

ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి

జూలపల్లి: నిరుద్యోగులు ఆత్మవిశ్వాసంతో స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ సూచించారు. మండల కేంద్రంలో నిరుద్యోగి అందె శ్రీరాజ్ ఏర్పాటు చేసుకున్న శ్రీ ఫొటోగ్రఫీ స్టూడియోను ఆయన ప్రారంభించారు.

ధర్మం గెలవాలంటే వర్గీకరణ జరగాలి

ఎలిగేడు: ఎస్సీవర్గీకరణ న్యాయమైందని, ధర్మం గెలవాలంటే ఎస్సీవర్గీకరణ జరిగి తీరాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు మంథని చందు మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్‌మాదిగ, మండల అధ్యక్షుడు జిల్లి రమేశ్ మాదిగ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. 8న గోదావరిఖనిలో మందకృష్ణ మాదిగ పాల్గొనే పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి సమావేశానికి మాదిగ, మాదిగ ఉపకులాలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుల్తానాబాద్ సీఐగా సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరణ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ సీఐగా సుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జగదీష్ బదిలీపై హైదారాబాద్‌కు వెళ్లగా, వరంగల్‌లో సీబీడీలో పని చేసి బదిలీపై సుల్తానాబాద్‌కు వచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును సుల్తానాబాద్‌లో కలిసి మొక్క అందజేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పెద్దపల్లిరూరల్: మండలంలోని కాపులపల్లిలో శనివారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు సమర్పించారు.

శ్రీపాదరావు ఆశయాలు కొనసాగిస్తాం



నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి: ఉమ్మడి ఏపీ అసెంబ్లీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు ఆశయసాధనకు కృషి చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రామయ్యపల్లిలోని శ్రీపాదరావు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. మంథని ప్రాంత అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పాటుపాడిన శ్రీపాదరావును స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, నాయకులు ఎండీ మంజూర్, దేవునూరి శ్రీనివాస్, చిందం మహేశ్, గంట వెంకటరమణారెడ్డి, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, నరేశ్‌యాదవ్, రాధారెడ్డి, వేము కనకయ్య, కండె పోచం పాల్గొన్నారు. సెంటనరీకాలనీ తెలంగాణ చౌరస్తాలో మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కాటం సత్యం, నాగెపల్లి గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. 200యూనిట్లలోపు పలు గృహాలకు జీరో కరెంట్ బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, తహసీల్దార్ స్వర్ణ, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, విద్యుత్ డీఈ తిరుపతి, సుల్తానాబాద్ ఏడీ వెంకటేశ్వర్లు, ఏఈ సంపత్‌రెడ్డి, లైన్‌మెన్ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు కొరుకంటి వెంకటేశ్వర్‌రావు, భూర్ల సింధూజ, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, పర్శరాములుగౌడ్, శ్రీనివాస్, కుమార్, తిరుపతిగౌడ్, తిరుమల్‌రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం సుద్దాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10లక్షల సీసీరోడ్డు, చిన్నబొంకూర్‌లో రూ.20లక్షల గ్రామపంచాయతీ భవన నిర్మాణం, రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దాని దిశగానే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జెడ్పీటీసీ స్వరూప, నాయకులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, దామోదర్, సతీశ్ ఉన్నారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చింతల లక్ష్మి

గోదావరిఖని: ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని ఆర్జీ–1 సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు చింతల లక్ష్మి కోరారు. శనివారం సింగరేణి సేవా భవన్‌లో సింగరేణి సేవా సమితి శిక్షకులు, మెంబర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు, సింగరేణి మహిళా ఉద్యోగులకు, గృహిణులకు ఈ నెల 4న జీఎం కాలనీ స్టేడియంలో వివిధ ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 7న సింగరేణి సేవా భవన్‌లో ఉత్తమ మహిళలకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. సేవా కోఆర్డినేటింగ్ అధికారి బంగారు సారంగపాణి, కోఆర్డినేటర్లు మేడి తిరుపతి, నగునూరి రవికుమార్ పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రమాదాలు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిలో అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదాలు పెరుగుతున్నాయని సీఐటీయూ సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులపై సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే వకీల్‌పల్లి మైన్‌లో నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పని స్థలంలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఉల్లి మొగిలి, భూమయ్య, రాములు, రవి, ఉపేందర్, రవికుమార్, లక్ష్మణ్, సురేశ్, రామన్న పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



బసంత్‌నగర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ

పాలకుర్తి: జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్సై స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై పయనించారు. కన్నాల టోల్‌ప్లాజా నుంచి ప్రారంభమైన ర్యాలీ జీడీనగర్ మీదుగా బసంత్‌నగర్ బస్టాండ్ వరకు కొనసాగించారు. ఎస్సై స్వామి మాట్లాడుతూ బైక్ డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, రహదారిపై ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. సిబ్బంది శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లు ప్రారంభం

జూలపల్లి: గృహజ్యోతి శనివారం మండల కేంద్రంలో ప్రారంభమైంది. స్థానిక బస్టాండు ఏరియాకు చెందిన వినియోగదారుల ఇళ్లలో రీడింగ్ తీసి జీరో బిల్లులను విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా 198 యూనిట్ల వరకు జీరో బిల్లు వచ్చినట్లు వినియోగదారులు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ముమ్మాడి రవి, పొట్యాల శంకరయ్య, కొమురయ్య ఉన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

ధర్మారం: బస్తీ సంపర్క్ అభ్యాన్‌లో భాగంగా మండలంలోని కటికెనపల్లి గ్రామంలో శనివారం బీజేపీ దళితమోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కిషోర్, లక్ష్మణ్, వెంకటేశ్‌గౌడ్, రాములు, అహ్మద్, సాయి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలి

పాలకుర్తి: పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాలకు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని ఉమ్మడి కన్నాల గ్రామానికి చెందిన పుట్ట రంజిత్, భూతగడ్డల తిరుపతి, ఇస్లావత్ సమ్మయ్య జిల్లా మైనింగ్ అధికారి సాయినాథ్‌ను కోరారు. శనివారం జిల్లా మైనింగ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సాండ్‌టాక్స్ పాలసీలో తమ ట్రాక్టర్లను నడుపుకునేందుకు రూ.25వేలు చెల్లించామని, ప్రస్తుతం సాండ్‌టాక్స్ బుకింగ్ తమ మండలంలో కావడం లేదని, సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, గట్టెపల్లి, అంతర్గాం మండల గోలివాడ ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండటం మూలంగా తాము ఉపాధి కోల్పోతున్నామని వాపోయారు.